## క్లుప్తంగా

### రేపు సీవోఈ ఎంట్రెన్స్ పరీక్ష

ఆదిలాబాద్‌రూరల్: టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ 2024–25 విద్యా సంవత్సరానికి ఈనెల 18న కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని టీటీడబ్ల్యూఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మిప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు.

### ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

నేరడిగొండ: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పీజీహెచ్‌ఎం షేవాసింగ్ అన్నారు. మండలంలోని లఖంపూర్ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఎస్సెస్సీ ఇంటర్నల్ మార్కులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రణాళికబద్ధంగా ప్రత్యేక తరగతులు బోధించాలని సూచించారు. ఆయన వెంట జి.మధుసూదన్ రెడ్డి, బి.బాపురావు ఉన్నారు.

### జాబ్ మేళాకు స్పందన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఎస్‌బీఐ లైఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన లభించింది. కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. అధికారులు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగంలో స్థిరపడాలనే ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహించడం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్‌రావు, కోఆర్డినేటర్ కోటయ్య, చైతన్యకృష్ణ, సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### భీంపూర్ తహసీల్దార్‌గా సత్యనారాయణ

తాంసి: భీంపూర్ మండల తహసీల్దార్‌గా సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన నారాయణ గత రెండు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. కాగా.. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ హరిదాస్‌కు బాధ్యతలు అప్పగించారు. నిర్మల్ జిల్లాకు చెందిన సత్యనారాయణను జిల్లా ఉన్నతాధికారులు భీంపూర్ తహసీల్దార్‌గా నియమించారు. నూతన తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### బాధ్యతలు స్వీకరించిన సీఐ రమేశ్

బోథ్: బోథ్ సర్కిల్ సీఐగా బానోత్ రమేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన భీమేష్ ఇచ్చోడ సీఐగా బదిలీపై వెళ్లారు. మహబూబాబాద్‌లో సీఐగా విధులు నిర్వర్తించిన రమేశ్‌ను బోథ్ సీఐగా బదిలీపై వచ్చారు. ప్రజల సహకారంతో శాంతి భద్రతలను సక్రమంగా నిర్వర్తిస్తామని అన్నారు.

### ప్రణాళికాబద్ధంగా చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

బజార్‌హత్నూర్: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని డీఈవో ప్రణీత అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, జెడ్పీఎస్‌ఎస్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. చదివేటప్పుడు అనుమానాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి నారాయణ, ప్రధానోపాధ్యాయులు నరేశ్, రాజశేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

### అనారోగ్యంతో పీఏసీఎస్ డైరెక్టర్ మృతి

బోథ్: బోథ్ మండల పీఏసీఎస్ డైరెక్టర్ కనక శ్యాంరావ్ (65) శుక్రవారం మృతి చెందారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్యాంరావ్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం అకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎంపీపీ తుల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్ సంతాపం తెలిపారు.

### కార్యవర్గం ఎన్నిక

కైలాస్‌నగర్: ప్రింట్ మీడియా ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈదాపు రవీందర్, ప్రధాన కార్యదర్శిగా చింతల అరుణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ముస్కు రాజ్ కిరణ్ రెడ్డి, కార్యదర్శిగా పిట్ల రాము, కోశాధికారిగా బడాల కిరణ్ రెడ్డిలను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడిని శాలువాతో సత్కరించారు.

# సమ్మె విజయవంతం

- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- మండల కేంద్రాల్లో నిరసన ర్యాలీలు



ఉట్నూర్‌రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు

ఎదులాపురం: కార్మిక, రైతు వ్యతిరేక విధానాల అవలంభిస్తున్న కేంద్రం తీరును నిరసిస్తూ.. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఫ్లెక్సీని దహనం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు పండించే పంటలను కొనుగోలు చేసేందుకు సరైన మార్కెట్ వ్యవస్థ లేక గిట్టుబాటు ధర లభించక నష్టోవడం జరుగుతుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, బెజ్జంకి నర్సింగరావు, గేడం పొచ్చిరాం, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో సీఐటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి ఉట్నూర్ ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేతావత్ రాందాస్ మాట్లాడుతూ.. రైతులకు బీజేపీ ప్రభుత్వం చేసింది ఏమి లేదన్నారు. వెంటనే రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశలు, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు సమ్మెలో పాల్గొన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మారుతి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలతో పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. సమ్మెలో కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉస్మాన్, నాయకులు ఆజం, ప్రమోద్, దరాడే ఛాయా, ఇందుమతి పాల్గొన్నారు.

తలమడుగు: కేంద్ర ప్రభుత్వం అవలభిస్తున్న ఉద్యోగ, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్, ఐకేపీ, ఆశ కార్యకర్తలు, జీపీ కార్మికులకు ఉద్యోగాలు భద్రత కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనుసుయా, కళావతి, శోభ, స్వరూప, రమణ, లలిత, వినోద్, అశ్విని రాధ, లక్ష్మీ, మీనా, భాగ్యమ్మ, సంగీత పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం**

ఇచ్చోడ: బీజేపీ ప్రభుత్వం కార్మికులు సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు కార్మిక సంఘాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సమ్మెకు మద్దతుగా రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల మల్లేష్, చరణ్ గౌడ్, ఆనంద రావు, మహిముద్ ఖాన్, రేణిగుంట సురేశ్, కల్లెం నారాయణ రెడ్డి మద్దతు తెలిపారు.

తాంసి: కార్మికులు, రైతుల హక్కులను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తూ అన్యాయం చేస్తోందని అంగన్‌వాడీల జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ అన్నారు. శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలో దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా గ్రామీణ భారత్ బంద్ నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమ్మెలో వీవోఏల అధ్యక్షుడు అరుణ్, పంచాయతీ కార్మికుల అధ్యక్షుడు ఇంద్రజ్, తులసీబాయి, రాధ పాల్గొన్నారు.

నార్నూర్: మండల కేంద్రంలో కార్మిక సంఘాలతో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. దేశ వ్యాప్తి సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశలు, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ కుమార్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండలాధ్యక్షుడు జాడే నాందేవ్, అంగన్‌వాడీ అధ్యక్షురాలు పంచశీల, ఝాడే తాయి, శివబాయి, మైనోద్దీన్, దేవిదాష్, చాంద్ పాషా, లీలబాయి, సంగీత, రాంజీ, వెంకట్, సురేందర్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: కేంద్ర ప్రభుత్వం మోసపూరిత హామీలకు, కార్పొరేట్, మతత్వ విధానాలకు నిరసనగా శుక్రవారం మండలంలో కార్మిక సంఘాలు నిర్వహించిన గ్రామీణ భారత్ బంద్ విజయవంతం అయింది. సీఐటీయూ మండల అధ్యక్షులు కీర్తి రమణ మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించి కార్మికుల పొట్టకొడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆవుల రవి, సతీష్, రాజు, సురేశ్, చంద్రకళ, భాగ్యలక్ష్మి, హేమలత, మంజుల, రాధ పాల్గొన్నారు.



ఎదులాపురం: ఫ్లెక్సీ దహనం చేస్తున్న నాయకులు



నార్నూర్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



తలమడుగు: సమ్మె చేస్తున్న కార్మికులు



తాంసి: భీంపూర్‌లో..



ఇచ్చోడ: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



బజార్‌హత్నూర్: రాస్తారోకో చేస్తున్న కార్మికులు



గుడిహత్నూర్: సమ్మెలో పాల్గొన్న కార్మికులు

### భవన నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

తలమడుగు: మండలంలోని కొత్తూరు పాఠశాల ఆవరణలో ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మిస్తున్నారని శుక్రవారం గ్రామానికి చెందిన యువకులు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ కొంతమంది రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల వల్ల పిల్లలను బడికి దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఇకనైనా అధికారుల స్పందించి భవన నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువకులు మహేందర్, అశోక్, అడేల్లు, ప్రమోద్, భూమన్న, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

ఆదిలాబాద్: ఎస్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఏస్సీఈఆర్టీ మెంబర్ సర్దార్ ధర్మేంద్ర సింగ్ జయంతి కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని దుర్గానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, గంగా సాగర్, పాఠశాల హెచ్‌ఎం అరుణ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

బోథ్: తెలంగాణ గెజిటెడ్ జూనియర్ అధ్యాపకుల సంఘం 475 చెందిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చట్ల ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు జయరాజ్, నాందేవ్, ఉదయ్ రెడ్డి, అనిల్, లక్ష్మిపతి, రాజు, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

### 'బాండ్ల రద్దు సమాచార హక్కు చట్టం విజయం'

బోథ్: ఎన్నికల బాండ్లను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు సమాచార హక్కు చట్టం విజయమని సీపీఐ మండల సహాయ కార్యదర్శి షాకీర్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల బాండ్ల గోప్యత పేరుతో సమాధానం చెప్పకుండా సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పుతో దేశంలోని ఏ పార్టీకి ఎంత విరాళాలు వచ్చాయో తెలుసుకునే అవకాశం ఉందన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై ఇమ్రాన్

గుడిహత్నూర్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ఇమ్రాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బైక్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాలే శివాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'ప్రధానమంత్రి జన్‌మాన్' సద్వినియోగం చేసుకోవాలి



గిరిజనులకు పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి, జిల్లా పశువైద్యాధికారి కిషన్

తలమడుగు: గిరిజన రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన్‌మాన్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జిల్లా పశువైద్యాధికారి కిషన్, జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నడిమ్‌పల్లె గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొలాం గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు మూడు లక్షల వరకు అందించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో 100 జిల్లాలను ఎంపిక చేయడం జరిగిందని ఇందులో 22 వేల గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమని అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్, ఎంపీపీ కల్యానం లక్ష్మి రాజేశ్వర్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి వంశీ, సుస్మిత రమేశ్‌రెడ్డి, మారుతి పాల్గొన్నారు.

## యోగాతో ఎన్నో ప్రయోజనాలు



సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్: నిత్యం యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో జిల్లా యోగాసనం స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. మానసిక ఆరోగ్యానికి సూర్య నమస్కారాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం యోగాను క్రీడగా గుర్తించిందని తెలిపారు. శిక్షకుల పర్యవేక్షణలో ప్రతీరోజూ యోగా చేయాలని సూచించారు. అనంతరము యోగా గురువు తిరుపతిరెడ్డి, శిక్షకులు చేతన్, సంతోష్, ప్రజ్యోత్, సంధ్య, రూప విద్యార్థులచే సూర్య నమస్కారాలు చేయించారు.

బోథ్: మండల కేంద్రంలోని శిశుమందిర్‌లో శుక్రవారం రథసప్తమి సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సూర్య నమస్కారాలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అనిల్‌కుమార్‌ను నామినేట్ చేయడం హర్షణీయం

ఎదులాపురం: యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అనిల్ కుమార్‌ను రాజ్యసభకు నామినేట్ చేయడంపై జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి 24 ఏళ్లుగా సేవలందిస్తున్న అనిల్‌కుమార్‌కు సముచితం స్థానం కల్పించిందన్నారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే

నార్నూర్: మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీకి చెందిన జాదవ్ రాఘవేంద్రనాయక్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగానికి ఎంపిక కావడంతో శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, సేవాలాల్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శ్రీబానోత్ గజానంద్ నాయక్ సన్మానించి అభినందించారు. కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి నైపుణ్యం కలిగిన రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ ఈఈ విఠల్ రాథోడ్, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, మహిళ నాయకురాలు రాథోడ్ దేవుక బాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఎంపీడీవోకు సన్మానం

బోథ్: బోథ్ మండల పరిషత్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన రమేశ్‌ను పలువురు శుక్రవారం సన్మానించారు. బీఆర్‌ఎస్ నాయకులు బీమ బుచ్చన్న, వెంకటేశ్, నక్కలవాడ గ్రామంలో ఎంపీటీసీ జుగాది రావ్, మాజీ సర్పంచ్ విజయ్‌లు సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### గణిత ఉపాధ్యాయుడికి నివాళి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ గణిత ఉపాధ్యాయుడు సర్దార్ ధర్మేందర్ సింగ్ చహెల్ జయంతి వేడుకలను శుక్రవారం ధర్మ విద్యాలయం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ధర్మేందర్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సర్దార్ సోహన్ సింగ్ చహెల్, ప్రిన్సిపాల్ స్వప్నలత, నిర్వాహకులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధికి కృషి చేయాలి



గోదాంను ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: రైతుల అభివృద్ధికి పార్టీలకతీతంగా సమిష్టిగా కృషి చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రూ. 50 లక్షలతో నిర్మించిన సహకార సంఘం నూతన గోదాంను డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలోనే సహకార సంఘం గోదాం ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రైతు అభివృద్ధి చెందినప్పుడే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇచ్చోడ సహకార సంఘం గిడ్డంగుల కోసం ప్రభుత్వం ద్వారా రెండు ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. రైతులకు కావాల్సిన యూరియ, డీఏపీ ఎరువులను అందచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, సహకార సంఘం చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, డీసీవో మోహన్, డీసీసీబీ సీఈవో శ్రీధర్‌రెడ్డి, ఆడిట్ అఫీసర్ రాథోడ్ బిక్కు, నాబార్డ్ ఏజీఎం శెథర్, ప్రజ్ఞ, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశం వాయిదా



వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీపీ

నేరడిగొండ: అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో నేరడిగొండ మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్ ప్రకటించారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశం అనంతరం ఎంపీపీ రాథోడ్ సజన్ ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. ప్రత్యేకాధికారుల పాలన ఉన్నందున గ్రామాల్లో సమస్యలపై ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేలా చూడాలని అన్నారు. పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వేసవి కాలం సమీపిస్తున్నందునా నీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, ఆర్ఐ నాగోరావు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తాం



సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గజేందర్

నేరడిగొండ: నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి రోడ్డు వేసే బాధ్యత తీసుకుంటానని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని కుమారి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ఎస్సీ కాలనీ వరకు రూ.5 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆడే వసంతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి ప్రపుల్ చందర్ రెడ్డి, భీమ్‌రాజ్ గౌడ్, నారాయణా గౌడ్, శ్రీధర్, సంతోష్, బ్రహ్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

### విధులు సక్రమంగా నిర్వర్తించాలి

నేరడిగొండ: అంగన్‌వాడీలు విధులను సక్రమంగా నిర్వర్తించాలని సీడీపీవో సౌందర్య అన్నారు. సూపర్‌వైజర్ మంజులతో కలిసి శుక్రవారం మండలంలోని సావర్గాం అంగన్‌వాడీని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు తమ విధులను మర్చిపోవద్దన్నారు. చిన్నారులకు ప్రీస్కూల్ విద్యతో పాటు లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. రాజులతండా అంగన్‌వాడీని పరిశీలించిన ఆమె ప్రీస్కూల్ పిల్లల హాజరు బాగుందన్నారు. అలాగే బుర్కాపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గది చాలా చిన్నదిగా ఉండడంతో వేరో చోటుకి మార్చాలని ఆదేశించారు.

### భూమిపూజ

జైనథ్: మండలంలోని ఆకోలి, మాండగా, పెండల్‌వాడ గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి భూమిపూజ చేశారు. శుక్రవారం ఆకోలిలో రూ. 3 లక్షలతో, మాండగాడలో రూ. 10 లక్షలతో, పెండల్‌వాడలో రూ. 14 లక్షలతో సీసీరోడ్లు, డ్రైయినేజీల నిర్మాణానికి భూమపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్, అల్లూరి భూమారెడ్డి, యాల్ల పోతారెడ్డి, బాయిన్‌వార్ గంగారెడ్డి, మునిగెల విఠల్, దీపక్ రావ్, సైపట్ మహేందర్ రావ్, జంగిలి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి సౌకర్యం కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోథ్: ఆదివాసీ గ్రామాలైన లెండిగూడ, మహదుగూడ, జైతుగూడ, నాగుగూడ గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని తుడుందెబ్బ నాయకులు శుక్రవారం ఎంపీడీవో రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ సానాల అధ్యక్షుడు జుగ్నక్ మారుతి, కార్యనిర్వాహక అధ్యక్షులు పెస్వే సంగ్రం, ఉపాధ్యక్షుడు మానిక్ రావ్, కార్యదర్శులు భీంరావ్, గెడం బండు, శంభు, ఆనంద్ రావ్, తదితరులు పాల్గొన్నారు.